# నమస్తే తెలంగాణ

## జోగుళాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, సోమవారం 12 ఆగస్టు 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


### భోజనంలో పురుగులు



భోజనంలో అప్పుడప్పుడూ పురుగులు వస్తున్నాయి. నాణ్యతగా భోజనం వడ్డించాలి.అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ రాత్రి 7:15 గంటలకు భోజనం పెడుతున్నారు. పండ్లు, గుడ్లు కూడా అందిస్తున్నారు.

– జయలక్ష్మి, 8వ తరగతి, బాలానగర్ గురుకుల పాఠశాల

### నాణ్యత పెంచాలి..



బియ్యం నాణ్యతగా లేకపోవడంతో భోజనంలో తరచూ పురుగులు వస్తున్నాయి. పురుగుల అన్నం తినాలంటేనే ఎట్లాగో ఉంటుంది. తిన కుండా ఉంటే కడుపు మాడుతుంది. అలాగని తింటే కడుపులో నొప్పి వస్తుంది. అధికారులు స్పందించి మంచి భోజనం అందించాలి.

– లక్ష్మీప్రణతి, 7వ తరగతి, బాలానగర్ గురుకుల పాఠశాల

# డార్మిటరీలు కరువు

- తరగతి గదుల్లోనే విద్యార్థుల బస
- బాలానగర్ గురుకులంలో విద్యార్థుల అవస్థలు

బాలానగర్, ఆగస్టు 11 : మండల కేంద్రంలోని బాలికల గురుకులం సమస్యలకు నిలయంగా మారింది. చదువులో ఉన్నత ఫలితాలు.. క్రీడల్లో జాతీయ స్థాయి ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులున్న సరస్వతీ నిలయంలో అటు పాలకులు.. ఇటు అధికారులు అభివృద్ధికి శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సుమారు 30 ఏండ్ల కిందట బాలికల గురుకులం నిర్మించగా.. పాఠశాల, జూనియర్ కళాశాలకు సంబంధించి సుమారు 650 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే భోజనశాల సరిపోకపోవడంతో విడుతల వారీగా భోజనం వడ్డిస్తున్నారు. శిథిలమైపోయి.. ఎప్పుడు కూలిపోతుందో తెలియని వంట గదిలో భయపడుతూ వంటవాళ్లు వండిపెడుతున్నారు. డార్మిటరీలు చాలకపోవడంతో విద్యార్థులు తరగతి గదుల్లోనే పడుకుంటున్నారు. వర్షం వస్తే కురుస్తుండడంతో ప్రమాదకరంగా చదువులు చదవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. విద్యుత్ బోర్డులు తడిసిపోయి గోడలను తాకితే షాక్ కొడుతుందని మరికొందరు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని ఇరుకుగదుల్లో కాలం వెల్లదీస్తున్నారు. దీంతో సమస్యలకు కేరాఫ్‌గా మారింది. భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం నాసిరరకంగా ఉండడమే ఇందుకు కారణం.. పురుగులు ఉన్న బియ్యాన్ని తిరిగి పంపిస్తున్నామని, ఆపై సరఫరా చేస్తున్న బియ్యంలోనూ పురుగులు యథావిధిగా ఉంటున్నాయని స్కూల్ టీచర్లు చెబుతున్నారు. ఇక్కడ నెలకొన్న స మస్యలపై పాలకులు, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.



ఇరుకు గదిలో వంట చేస్తున్న సిబ్బంది



బాలానగర్ గురుకుల పాఠశాలలో నేలపై కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థినులు



మక్తల్ అంబేద్కర్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకులంలో పడకగదిలోనే కొనసాగుతున్న తరగతులు

# సమస్యల సుడిగుండం!



ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకులంలో నీళ్లు లేక తాళం వేసిన మరుగుదొడ్లు

నారాయణపేట, ఆగస్టు 11 : తెలంగాణ తొలి ప్రభుత్వంలో పదేండ్లు పకడ్బందీగా సాగిన గురుకుల పాఠశాలల నిర్వహణ కాంగ్రెస్ సర్కారులో అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. నారాయణపేట జిల్లాలోని పలు గురుకులాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం తాగునీరు కూడా లేని పరిస్థితి నెలకొన్నది. సరిపడా గదులు లేక చదువు ఒకేచోట, పడుకునేది కూడా ఒకేచోట కొనసాగుతున్నది. ధన్వాడ ఎస్టీ గురుకులంలో తాగునీళ్లు కూడా లేవు. పాఠశాల, జూనియర్ కళాశాలతో కలిపి మొత్తం 650 మంది విద్యార్థులున్నారు. మరుగుదొడ్లు ఉన్నా నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో కాలకృత్యాల కోసం విద్యార్థులు గురుకుల సమీపంలోని చెట్లపొదల్లోకి వెళ్లాల్సి దుస్థితి నెలకొన్నది. డ్రెస్‌తోపాటు కాస్మొటిక్ ఇవ్వడం లేదు. గురుకుల పరిసరాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. ప్రహరీ ఉన్నా గేటు లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. కృష్ణ మండలంలోని హిందూపూర్ కస్తుర్బాగాంధీలో ఇది వరకున్న భవనంలో 6 నుంచి 10వ తరగతి వరకు కొనసాగేది. ఇటీవల ఇంటర్మీడియట్ స్థాయికి పెంచడంతో 50మంది విద్యార్థులు అదనంగా చేరారు. కానీ అదే పాత భవనంలో పాఠశాల, కళాశాల నిర్వహిస్తుండడంతో ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నారు. మాగనూర్ మండలంలోని నల్లగట్టు మారెమ్మ ఆలయం సమీపంలోని గురుకులానికి ప్రహరీ లేదు. సమీపంలోనే మద్యం దుకాణం ఉండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. నారాయణపేట సమీపంలోని ఎర్రగుట్ట గురుకులానికి ప్రహరీ ఒక వైపు కూలిపోవడంతో కుక్కలు గురుకులంలోకి వచ్చి కరుస్తున్నాయని వాపోతున్నారు. మద్దూరు ఎస్సీ బాలికల గురుకులానికి సొంత భవనం లేదు. దామరగిద్ద గురుకులంలో ఇంటర్మీడియట్ స్థాయికి పెంచడంతో ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నారు. మక్తల్ గురుకులలో 400 విద్యార్థులకు ఇరుకు గదుల కారణంగా తరగతులు నిర్వహించిన గదుల్లోనే పడుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. నర్వలో బాలికలకు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ బాలికల గురుకులాన్ని సంగంబండ రిజర్వాయర్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేయగా, సరిపడా గదులు లేవు. మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊట్కూరు గురుకులంలో డార్మిటరీ లేదు. కోస్గి మండలం నాచారంలోని గురుకులంలో తాగునీరు లేక కలుషిత నీటిని తాగి అస్వస్థతకు గురవుతున్నారు. అలాగే ఇటీవల పురుగుల అన్నం కారణంగా విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలిపారు.



ప్రహరీ లేని హన్వాడ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల

### ప్రహరీ లేక విషసర్పాల సంచారం

హన్వాడ, ఆగస్టు 11 : మండల కేంద్రంతోపాటు పల్లెమోనికాలనీ వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ప్రహరీలేక గురుకులాల్లోకి విషసర్పాలు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పల్లెమోనికాలనీ వద్ద గల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, అటెండర్ కొరత ఉన్నది. నీళ్ల కోసం బోర్లు వేసినా చుక్కనీరు పడకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు కనీస మౌలిక సదుపాయాలు లేక నిత్యం విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టింపు లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

- గురుకులాల్లో కనీస సౌకర్యాలు కరువు
- చాలీచాలని గదులతో ఇబ్బందులు
- తాగునీటికి సైతం కటకట
- ఒంటికి, రెంటికీ ఆరుబయటికే..
- పట్టించుకోని అధికారులు



కొండాపూర్‌లో మరమ్మతుకు నోచుకోని బోరుమోటరు

### ప్రజల జీవితాల నుంచే పాటలు

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 11 : నిత్య జీవన విధానాల నుంచే పాటలు వస్తాయని, ప్రముఖ కవి, గాయకుడు, శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశపు హాల్‌లో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహించిన సభకు కల్వకోలు మద్దిలేటి అధ్యక్షత వహించారు. పాట నిర్మాణంపై జరిగిన వర్క్‌షాప్‌కి ముఖ్యఅతిథిగా దేశపతి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. మానవత్వం, సామాజిక దృక్పథం, సిద్ధాంతాలు పాట లక్షణాలన్నారు. పల్లెల్లోనే ఎక్కువగా పాటలు వస్తాయని, ప్రజాయుద్ధనౌక గద్దరన్న పాటలు ఇందుకు ఉదాహరణ అన్నారు. పాలమూరు మట్టిబిడ్డ పురుశోత్తమని, పౌరహక్కులకు ప్రాణం పోసిన నేతంటూ వట్టికోట ఆళ్వారుస్వామి, గూడా అంజన్న, ప్రజా యుద్ధనౌక గద్దరన్నకు వందనాలు అంటూ అమరులపై ప్రజాగీతాలను ఆలపించారు. దాశరథి, గోరటి వెంకన్న, పాల్కూరి సోమన్న, పోతన, తెలంగాణ కవులు సుద్దాల హన్మంతు, మల్లావఝల సాదాశివుడు అనుసరించిన బాణీలను, వారి కవిత్వాన్ని వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. జానపద బాణీలు తెలంగాణ సాయుధపోరాటం కారంచేడు, చుండూరు, పదిరికుప్పం, వేంపేట తెలంగాణ మలిదశ ఉద్యమం, ప్రజానాట్య మండలి, జననాట్యమండలి ఆయా కాలాల్లో వచ్చిన ఉద్యమాల్లోని కవులు, గాయకులు పాడిన పాటలను వివరించారు. అమ్మకు పురిటి నొప్పులుంటే, నాన్నకు పుడమి నొప్పులని పాడిన పాటకు సభలో అందరూ కంటతడి పెట్టారు. అనంతరం దేశపతి శ్రీనివాస్, పసునూరి రవీందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు రాములు, కాశన్న, జయప్రకాశ్, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వహీద్‌ఖాన్, కందికొండ మోహన్, నీరటి బాలీశ్వర్, ఇద్రీస్, గౌస్‌పాషా, విజయకాంత్, దేవదానం, భూపాల్‌రెడ్డి, ప్ర భాకర్, గోపాల్, కృష్ణయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

### భర్తను చంపిన భార్య?

గట్టు, ఆగస్టు 11 : గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డికి చెందిన కర్రెప్పకు నలుగురు కూతుర్లు ఉండగా, మగ సంతానం లేరు. దీంతో అయిజ మండలం ఎక్లాస్‌పూర్‌కు చెందిన కుర్వ నర్సింహులును ఇల్లరికం అల్లుడిగా తెచ్చుకున్నాడు. కాగా, శనివారం నర్సింహులు అనుమానాస్పదంగా మృతిచెందాడు. గొంతు దగ్గర నులిమినట్లుగా, వృషణాలపై దాడి చేసినట్లుగా పోలీసులు గాయాలను గుర్తించారు. నర్సింహులుతో భార్య జయమ్మ, అత్తామామలు సరోజమ్మ, కర్రెప్పలు గొడవపడినట్లు స్థానికులు చెప్పారని, మృతుడి సోదరుడు దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భీంకుమార్ ఎస్సై కేటీ మల్లేశ్ తెలిపారు.

# పచ్చని పొలాల్లో ఫార్మా చిచ్చు

- అభివృద్ధి పేరిట భూములు లాక్కుంటున్న సర్కారు
- ఫార్మావద్దు.. వ్యవసాయం ముద్దు అంటూ రైతుల ఆందోళన
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎంతవరకైనా పోరాడుతాం
- పొల్యూషన్‌ను గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్న సీఎం
- పొలాలు పోతే ఎత్తిపోతలతో ఉపయోగమేంటి..?
- అమెరికా నుంచి తెచ్చే కంపెనీలను కొడంగల్‌లో ఏర్పాటు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు



నిరసనలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్ (దుద్యాల), ఆగస్టు 11 : వ్యవసాయమే జీవనాధారంగా చేసుకున్న రైతన్నల గుండెల్లో ఫార్మా చిచ్చురేపుతున్నది. కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేనే సీఎం అయ్యారు. ఆ ఆనందం రైతుల కండ్లల్లో ఎంతో కాలం నిలవలేదు. అభివృద్ధి చేస్తున్నామంటూ పచ్చని పొలాలను ఫార్మా కంపెనీ పేరిట లాక్కుంటుండడంతో వారి గుండెల్లో గుదిబండ మోపినంత పనైంది. ఫార్మా ఏర్పాటు కోసం రైతులను సంప్రదించకుండా అధికారులు ఏకపక్షంగా సర్వే చేసి 1,274 ఎకరాలను సేకరించారు. ఈ క్రమంలో ఆదివారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం హకీంపేట గ్రామంలో ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండా రైతులు ధర్నా చేపట్టారు. ఫార్మావద్దు.. వ్యవసాయం ముద్దు అంటూ రైతులు నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నిరసనకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పేరిట నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి అనేది ప్రాంతానికి, ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలని.., సొంత లాభం కో సం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను లాక్కోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హైదరాబాద్ శివారులో ప్రజలు వ్యతిరేకించిన కంపెనీలను కొడంగల్‌కు తరలించి ఇక్కడి రైతుల పొట్ట కొట్టొద్దన్నారు. హకీంపేటలో 505, పోలెపల్లిలో 130, లగచర్ల, పులిచర్ల, రోటిబండతండాల్లో 643 ఎకరాలను లాక్కునేందుకు సీఎం కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రైతులను బెదిరించి బలవంతంగా భూములను లాక్కుంటే.. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కలుషితం చేసే కంపెనీలను తీసుకొస్తే స్వాగతించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో 1,154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యాక్రాంతమైందని, వాటి వద్దని సాగు భూములు లాక్కోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు రేవంత్‌రెడ్డికి సీఎం పదవిని కట్టబెడితే.. ఆయన మాత్రం కాలుష్య వాతావరణాన్ని గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఓపక్క కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతలతో సాగు నీరందిస్తామని చెప్పుకొంటూ.. మరోపక్క రైతుల భూములను ఆక్రమించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విధంగా సాగు భూములను లాక్కుంటూపోతే ఎత్తిపోతలతో ఎవరికీ ఉపయోగం ఉండదన్నారు. ఫార్మా కంపెనీల స్వలాభం కోసమే ఎత్తిపోతలను తీసుకొస్తున్నట్లు ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలో ఉన్నప్పటికీ మెడికల్, ఇంజినీరింగ్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. అమెరికా పర్యటనలో తెలంగాణకు వచ్చే టెక్స్‌టైల్, టెస్లా, ఐటీ కంపెనీలను తీసుకొచ్చి కొడంగల్‌లో ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తే స్వాగతిస్తామన్నారు.

కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ శా సం రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ కోట్ల మహిపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరాన్‌పల్లి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవతోనే జన్మకు సార్థకత

- అన్నిదానాల్లో కెల్లా విద్యాదానం గొప్పది
- మంత్రి దామోదర రాజనర్సింహ
- మదనాపురం, మూసాపేట మండలాల్లో పర్యటన

మదనాపురం, ఆగస్టు 11 : ప్రజాసేవతోనే జన్మకు సార్థకత చేకూరుతుందని, ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మదనాపురంలోని వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి రాజనర్సింహతోపాటు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి హాజరయ్యారు. ముందుగా మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లతో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి స్వరణ్‌సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండలంలోని కొన్నూరులో రూ.2.18కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్, రూ.20లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్, రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల భవనాలను మంత్రి రాజనర్సింహ ప్రారంభించారు. కొన్నూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాలను రూ.1.5కోట్ల వ్యయంతో నిర్మించగా, మన ఊరు–మనబడి కార్యక్రమం కింద ఉన్నత పాఠశాలలకు రూ.54.34 లక్షలు, ప్రాథమిక పాఠశాలకు రూ.8.77 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. మిగిలిన మొత్తాన్ని మాజీ ఎంపీటీసీ శరత్‌రెడ్డి విరాళంగా ఇవ్వడం అభినందనీయమని మంత్రి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంత డబ్బు సంపాదించినా ప్రయోజనం లేదని, ప్రజాసేవకు అంకితం అయినప్పుడే జన్మకు సార్థకత లభిస్తుందని చెప్పారు. శరత్‌రెడ్డిని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల నిర్మాణానికి నిధులు విరాళంగా అందించిన శరత్‌రెడ్డి, కొండారెడ్డిలను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అభినందించారు. దేవరకద్రలో 100 పడకల దవాఖాన, కొత్తకోటలో 50పడకల దవాఖాన ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరగా, సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీఈవో గోవిందరాజులు, పంచాయతీ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, మాజీ ఎంపీటీసీ శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

***మెరుగైన వైద్యం అందించాలి..***

మూసాపేట, ఆగస్టు 11 : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి రాజనర్సింహ వైద్యులకు సూచించారు. మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత ఉన్నదని డాక్టర్ షభానాబేగం మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.



జానంపేట పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ

***అంబాభవానీ ఆలయంలో పూజలు..***

కొత్తకోట, ఆగస్టు 11 : కొత్తకోట పట్టణంలోని అంబాభవానీ ఆలయంలో మంత్రి రాజనర్సింహ ప్రత్యేక పూజ చేసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రశాంత్, కృష్ణారెడ్డి, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.